


# కనువేదురు

"ఆc! రా, తొందరగా....చూడూ....ఆ ఆగివున్న టాక్సీ పక్కన నడుస్తో!"

కిటికీ చువ్వలకి తలానించి ఆతృతగా చూశాను. వచ్చేపోయే మనుషులూ, కార్లూ, జట్కాలూ, రోడ్డంతా క్రిక్కిరిసి వుంది. పైగా నేను చూస్తున్నది మేడ రెండో అంతస్తు నుంచి.

"ఆ ఊదా రంగు చీరె....!" అన్నాను అనుమానిస్తూ.

"అవును....అదే....అదే!" అంటూ ప్రకాశరావు కిటికీ చువ్వల మీద వేళ్ళతో టకటక మనిపించాడు.

"ఐతే లోగడే ఆమెన్నేనెరుగుదును. మొన్న మౌంట్ రోడ్డులో యెదురైంది. పేరు పుష్ప. బాపట్లలో వాళ్ళకో ఇల్లుంది. వాళ్ళ నాన్న సబ్‌రిజిస్ట్రార్ చేసి రిటైరయ్యాడు...." – చకచక చెప్పుకుపోతున్నాను.

"ఉహూc! నువ్వెరగవు!" అన్నాడు ప్రకాశరావు – "ఆమె పేరు పుష్ప కాదు – పారిజాతం. వాళ్ళకు వున్నది యిల్లు కాదు, పెద్ద మేడ. అదీ గుంటూరులో. వాళ్ళ నాన్న సబ్‌రిజిస్ట్రారు కాదు, సబ్‌జడ్జి చేసి రిటైరయ్యాడు"

ఇది నేను నమ్మలేని సంగతి. పుష్పని నేను బాగా యెరుగుదును. ఫిఫ్త్ ఫారం నుంచి స్కూల్

ఫైనల్ వరకూ ఆమె నా క్లాస్‌మేట్. అదంతా పదీ పన్నెండేళ్ళ నాటి మాట కావొచ్చు. ఐనా నేను ఆమెని ప్రేమించినంత పని చేశాను. మరి.... మరిచి పోవడం యెలా సాధ్యం?

"మొన్న ఓ వుత్తరం చూపానే?"

"ఆc!"

ప్రకాశరావు కళ్ళు చిట్లించి, చిరునవ్వు నవ్వాడు.

నేను నివ్వెరపోయాను.

"ఆమే రాసిందంటావా? నీకు...నీకు..." అన్నాను.

"అవును....నాకే....నాకే!" అన్నాడు ప్రకాశరావు.

నేను కిటికీ దగ్గిర నుంచి యివతలకు వచ్చి కుర్చీలో కూర్చున్నాను. ప్రకాశరావు ఎదురుగా మరో కుర్చీలో కూర్చుని నాకేసి చూస్తున్నాడు.

గది తలుపు కిర్రుమన్న ధ్వని. వెంటనే ఏదో మత్తు కలిగించే పరిమళం గదంతా కమ్మింది. ముఖమల్ చెప్పులు నున్నని గచ్చుమీద నిశ్శబ్దంగా చేసే శబ్దం.

కోకిలం గదిలోకి వస్తూనే – "అలా మాటమంతీ లేకుండా కూచున్నారేం?" అంటూ నవ్వింది.

"ఆc వీడూ...నేనేదో కోస్తున్నావనుకుంటున్నాడు!" అనేశాడు ప్రకాశరావు.

నేను పలకలేదు.

కోకిలం అందుకుని – "దేన్ని గురించీ?" అన్నది

"పారిజాతం!"

"ఆc! పారిజాతం పిచ్చిముండ! హుc" – కోకిలం జాలి తలస్తూన్నట్టు అని కుర్చీకి చేరగిలపడింది.

"నువ్వంత జాలి పడవలసిన స్థితిలో లేదనుకుంటాను పుష్ప!" అన్నాను, కొంచెం కటువుగా.

"పుష్ప కాదులే...పారిజాతం!" అంటూ కొంటెగా చూసింది ప్రకాశరావు కేసి కోకిలం.

ప్రకాశరావూ, కోకిలం భార్యాభర్తలు కాకపోయినా, వాళ్లది అదోలాంటి దాంపత్యం. గత నాలుగైదేళ్ళనుంచీ వాళ్ళు అలాగే కాలం గడుపుకు వస్తున్నారు. ప్రకాశరావుకు అంతో యింతో సొంతమంటూ కొంత ఆస్తి వుంది. కోకిలం వీలైనప్పుడల్లా సినిమాల్లో చిన్న చిన్న వేషాలు వేయడంద్వారా కొంత పేరు ప్రతిష్టల్నీ, కొద్దో గొప్పో ధనాన్నీ కూడపెట్తోంది.

"మైలాపూర్ వెళ్తున్నాను. పొద్దుగూక్కుండానే తిరిగొస్తాను" అంటూ ప్రకాశరావు లేచాడు.

"నన్ను యిలా పరాయి మగాడి దగ్గిర వొంటరిగా వదిలేశా?"

కోకిలం మాటలకి ప్రకాశరావు ఫక్కుమని నవ్వాడు.

నాకు నవ్వూ రాలేదు. కోపమూ కలగలేదు. కోకిలం విషకన్య. ఆమెని ఎరిగివున్న వాళ్ళందరికీ ఆ సంగతి తెలుసు.

"నువ్వు పారిజాతం అంటున్నావే – ఆ పుష్ప సంగతి నిజమేనా?" అని అడిగాను.

కోకిలం రెండు చేతులు తలకింద పెట్టుకుని కుర్చీకి బాగా చేరగిలపడి, ఆయాసపడు తోన్నట్టు

ఉఛ్వాస నిశ్వాసాల్ని బరువుగా వదుల్తూ కిలకిల్లాడింది.

"ఓ ఆ సంగతా! అదంతా నిజం. ప్రకాశ్ అంటే ఏమనుకున్నావ్, డాన్ - జు - ఆన్. ఇవ్వాళ ఆ పిక్చర్ కూడా రాక్సీలో ఆడుతోంది. వెళ్దామా?"

ఈ మాటలూ, ఆ ఆపసోపాలూ, ఓరచూపులూ దేనికి ఉపోద్ఘాతాలో నాకు తెలుసు.

"పుష్ప ప్రకాశరావుకు అలాంటి వుత్తరం రాసిన మాట నిజమేనా?" అన్నాను - విసుగ్గా.

"వుత్తరం ఏం ఖర్మం! ఆః!" అని నవ్వింది - "ప్రకాశ్ దగ్గిర ఇంకా అలాంటి వాళ్ళు రాసిన వుత్తరాలు ఓ మోపు వున్నై. మేం యిద్దరం అప్పుడప్పుడూ వినోదం కోసం చదువుకుంటాం"

కోకిలం కనుబొమల నుంచి దిగువ వరకూ అన్నీ కృత్రిమాలే? అంతా విదేశీ సరుకు. మాటలు కూడా!

"ప్రకాశ్ అంటే నీకు కోపం, జలసీ! అవునా?" అన్నది కోకిలం.

"నాకా...హుఁ! ఆ నరపశువు...."

"భలే బిరుదు యిచ్చావ్! కాని అతడి కోసం తాపత్రయపడి పడిగాపులు గాచిన ఆడముండల కెవరికీ ఆ సంగతి తెలీదు. లేక అలా అని తెలిసే వెంటపడ్డారేమో కూడా నాకు తెలీదు"

"పుష్ప సంగతి...."

"ఊఁ, పుష్ప సంగతి" అంటూ యీసడింపుగా నామాట పూర్తి కాకుండానే అందుకుంది కోకిలం - "అదంటే నాకు పరమ అసహ్యం. వట్టి పిచ్చిగొడ్డంటే నమ్ము!"

పుష్ప, నేను నా పదిహేనో యేటనే ప్రేమించిన పుష్ప. ఆ మాటకొస్తే ఆ రోజుల్లో మా ఫిఫ్త్ ఫారం క్లాసంతా ఆమెను ప్రేమించింది. సబ్‌జడ్జి టాగెట్ కొడుకు సైంధవుడిలా అడ్డుకునేవరకూ.

"ఆమె అంటే నీకెందుకంత ద్వేషం?" అని అడిగాను వూరికే వుండబట్టలేకే. కోకిలం సంభాషణా కాలక్షేపానికి ఏమాత్రం పనికి వచ్చే రకం స్త్రీ కాదని నాకు తెలుసు.

"అదంతా పెద్ద కథలే!" అంటూ పెద్దగా నవ్వి కాళ్ళతో గచ్చుమీద తపతప కొట్టింది.

"అంత పెద్ద కథా ఏం?" అన్నాను.

"ఓ చాలా పెద్ద కథ. నేనూ ప్రకాశ్ యిక్కడికి వచ్చేసరికి అది కాలేజీలో చదువుతోంది...."

"ఛ. అది ఏవిఁటి? కొంచెం గౌరవంగా మాట్లాడలేవా?" అన్నాను కోపంగా.

"కొంపదీసి నువ్వేమీ ప్రేమించలేదు కదా?"

ఆ ప్రశ్నలోవున్న వెటకారం నాకు చీదర కలిగించింది. దాదాపు ముక్కుపచ్చలారని వయసులో పుష్ప అంటే నాకున్న భావాన్ని ప్రేమ అనలేం. పైగా ప్రకాశ్ బోటి నరపశువు మీద కనువేదురుతో అలా ప్రవర్తించిన పుష్ప....

"ఒక పిల్లవాణ్ణి కూడా ఎక్కడో దొరికితే పెంచుకుంటోంది!" - పమిట నోటికి అడ్డం పెట్టుకుని ఒకటే పకపక - "దాని....తప్పు...ఆమె దృష్టిలో నేనో సామాన్య వ్యభిచారిని. పాపం ఘరానా సరుకు!"

"అంతవరకూ వచ్చిందంటావా....పిల్లని..."

"పిల్లాణ్ణి! పిల్లాణ్ణి! ఏడాదిపాటు అదీ మరోతీ కూడా పోటీపడ్డారంటే నమ్ము! వుత్తరాల మీద వుత్తరాలు. అసలు నేను వున్నాననేదే వాళ్ళకు గుర్తులేదు. బహుశా ఉఫ్ అంటే ఎగిరిపోయే ఏ వుల్లిపొట్టునో అనుకున్నారు. ఎంతపిచ్చి. ఆఁ!"

"ఈ పశువు కోసం!" – అంతకంటే ఘాటైన మాట నాకు కనపడలేదు.

"అవును. నీ దృష్టిలో యింకా మరికొందరి దృష్టిలో అతడో తాగుబోతూ...టక్కరీ, కాని పారి జాతం లాంటివాళ్ళ దృష్టిలో...."

"ఇప్పటిక్కూడానా?" అన్నాను ఠక్కుమని.

"ఇప్పటి సంగతి నాకు తెలీదు....అప్పట్లో...అతణ్ణి అర్థం చేసుకున్నది మేమే అనేవాళ్ళు"

"ఏముంది అర్థం చేసుకునేందుకు?"

"ఇంత తూకం...యింకా..."

"అదొక్కటే కారణం కాదనుకుంటాను"

"పైకి వస్తూన్న నాబోటి స్టార్‌తో అతడికున్న స్నేహం. నన్నే ఓడించి అతణ్ణి తనవాడుగా చేసు కుంటే – వాళ్ల అందాన్ని...దాని తాహతునూ గురించి వాళ్ళక్కలిగే తృప్తీ....అదంతా...."

"ఏవిఁటో సైకాలజీ మాట్లాడేస్తున్నావ్? కోటమ్మ యింతలేసి మాటలు వాడడం!"

కోటమ్మ....కోకిలం నవ్వింది.

నాకూ నవ్వొచ్చినట్టయింది.

"మరి నీ సంగతో?" అన్నాను.

"నా సంగతేంలేదు. అప్పట్లో నా సంస్కారానికీ, అవసరానిక్కూడా ఇంతకంటె జబ్బ పుష్టిగల జీవం దొరకలేదు. తీగ అయిన తరవాత ఏదో ఒక చెట్టంటూ ఆశ్రయం కావాలి గదా!"

"పుష్పలాంటి వాళ్ళక్కూడా అంతేనేమో!"

"అదేం కాదు. దురహంకారం. కుసంస్కారం. కుళ్ళుతూన్న ఒక వర్గం కనే పగటి కలలూ...."

ఆ మాటల్తో నేను నివ్వెరపోయాను.

"నేను మాట్లాడుతున్నది ఎవరితో. మాట్లాడేది ఎవరు?" అన్నాను.

"కోటమ్మతో కాదు – కోకిలంతో. ఈ మాటలూ, అభిప్రాయాలూ కోకిలానివి కావు – కోకిలం వేయబోయే సినిమాలోని వేషాలివి"

నేను నవ్వాను. యీసారి నా నవ్వులో హేళనా, చులక తనపు ధ్వనీ లేదు. బహుశా కోకిలం కూడా గ్రహించే వుంటుంది. ఆమె కళ్ళు అదోలాంటి వింత కాంతితో కదిలినై. చూపుల్లో హుందాతనం. పెదాల మీద ఆనీ ఆనని నవ్వుల నీడలు –

"నాకూ వాళ్ళకీ ఒహటే తేడా" అన్నది.

"అంటే?"

"ఊఁ! అంటే, తెలీనట్టు. నీబోటి వాళ్ళు ప్రేమించే ఆదర్శ స్త్రీలు..."

"వాళ్లు ఎవరంటావ్?"

"పుష్ప....పారిజాతంలాంటి...."

"ఛ, ఛ. ప్రమాణపూర్తిగా అలాంటిదేమీ లేదు"

నాలుక్కరుచుకున్నాను. ప్రమాణం లాంటి వాక్యం ఎందుకు వుపయోగించానా అనిపించింది. క్షణం బాధపడ్డాను.

"నాకూ వాళ్ళకీ ఒహటే తేడా!"

"మళ్ళీ మొదలా?"

"వాళ్లు కాల్పనిక ప్రియుల్తో...నేను...."

'ఛ, ఛ' అంటూ అక్కడి నుంచి లేచి వీధిలోకి వచ్చేశాను. కోకిలం అన్న ఆ ఆఖరి మాటలు నాకు వికారం కలిగించినై.

❋ ❋ ❋

ఆ సాయంకాలం తలవని తలంపుగా పుష్ప మెరీనా బీచీలో యెదురు పడింది.

"నన్ను గుర్తించగలరనుకుంటాను. మీరు నా క్లాస్‌మేట్. బాపట్ల హైస్కూల్లో..." అన్నాను.

"ఓహో, అలానా!"

నేను సగం చచ్చాను. బయటపడటం ఎలాగ అని ఆలోచించేలోపలే అక్కడికి యిద్దరు యువతులు వచ్చారు.

ఇంద్రధనస్సుల్లాంటి కనుబొమలు...రంగు పెన్సిళ్ళ గీతల్లా, గౌరీశంఖర శిఖరాలూ - శునకమధ్యాలూ!

"హల్లో పారిజాతం....!"

నన్ను చూసి గతుక్కుమన్నారు. 'హ్హా' అన్నారు ఎగశ్వాసతో. పుష్ప నాకేసి వెగటుగా చూసి వాళ్ళతో బయలుదేరింది.

"ఫూల్...నేనట...."

"ఊఁ పోనీ. రాక్సీలో డాన్ - జు - ఆన్ పిక్చర్. ఎరోల్ ఫ్లిన్!"

"నిమ్మీ అతన్తో యాక్టు చేయబోతోందిట తెలుసా?"

"దిలీప్‌కుమార్...."

"బీనారాయ్...నా కళ్ళు....మాధవరావ్....నాకు చాలా సిగ్గే...."

ఆపైన యిక వాళ్ళ మాటలు నాకు వినబడలేదు.

సముద్రపు హోరు. పేలవం అవుతూన్న సూర్యకాంతి. క్రమక్రమంగా నిర్మానుష్యం అవుతూన్న బీచి. నేను అక్కడే యిసకలో కూర్చున్నాను.

'మనసు గుర్రమురోరి మనిసీ' అన్న పాట గుర్తుకొచ్చింది.

ఎవరి మనస్సు? నేనూ, ప్రకాశరావూ, కోకిలం, పుష్పా, ఆ అమ్మాయిలూ.....

❋

*(ఆంధ్రజ్యోతి మాసపత్రిక : 1940-49 మధ్య)*